క్లుప్తంగా

ఘనంగా ఉమామల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దంపతులు

గోకవరం: మల్లవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉమామల్లేశ్వరస్వామి (శివాలయం)లో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉమా మల్లేశ్వరస్వామి, గణపతి, నందీశ్వరుడు, నగగ్రహాలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ముఖ్యఅతిథులుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, నాగసూర్యవేణి దంపతులు, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూలు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

ఉమారామలింగేశ్వరునికి పూజలు

ప్రత్తిపాడు రూరల్: దారపల్లి ఉమా రామలింగేశ్వర స్వామివారికి సోమవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక పండితులు చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. పెద్దిపాలెం, ఉత్తరకంచి, లంపకలోవ తదితర గ్రామాలను భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాకా చంటిబాబు, వెంకటేశ్వరరావు శిష్య బృందం పాల్గొన్నారు.

నేడు గోకవరంలో 'వలంటీర్లకు వందనం'

గోకవరం: గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కేఎస్ఎస్ఎన్ మూర్తి సోమవారం తెలిపారు. స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సచివాలయాల వలంటీర్లు, సిబ్బంది పాల్గొనాలన్నారు.

25న జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో..

గండేపల్లి: ఈనెల 25వ తేదీన వలంటీర్లకు వందనం కార్యక్రమం జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ అత్తులూరి నాగబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు హాజరై వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, అధికారులు హాజరుకావాలన్నారు.

పూడికతీతతో ముంపు నివారణ



కాలువలో పూడిక తీత పనులను పర్యవేక్షిస్తున్న వైస్ ఎంపీపీ, కార్యదర్శులు

తుని రూరల్: వర్షాకాలంలో ముంపు నివారించేందుకు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టినట్టు వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఎస్.అన్నవరం మేజరు పంచాయతీలో కాలువల్లో పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. వేసవిలో పూడికలు తీసేందుకు అనువుగా ఉంటుందన్నారు. దీంతో మేజరు పంచాయతీ పరిధిలో ఎస్.అన్నవరం, కొత్త సూరవరం, గెడ్లబీడు, జగన్నాథగిరి, రామకృష్ణా నగర్‌తో పాటు శివారు ప్రాంతాల్లోను పూడికతీతలు చేపట్టినట్టు ఆయన చెప్పారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన ఈ పనులు 20 రోజులు కొనసాగిస్తామని కార్యదర్శి మధుశేఖర్ తెలిపారు. ఈ పనులు చేసేందుకు గృహస్తులు సహకరించాలన్నారు. వ్యర్థాలను కాలువల్లో వేయవద్దని, పంచాయతీ ఏర్పాటు చేసిన కుండీల్లో వేయాలన్నారు.

రత్నగిరిపై విరాటపర్వం పారాయణ



విరాటపర్వం పారాయణ చేస్తున్న పండితులు

అన్నవరం: దేశమంతా విస్తారంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ రత్నగిరి సత్యదేవుని సన్నిధిన మహాభారతంలోని 'విరాటపర్వం' పారాయణ చేస్తున్నారు. దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ నెల 26వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. వేదపండితులు గంగాధర బట్ల గంగబాబు, సంతోష్ ఘనాపాఠీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ ఎన్నిక రేపు

పెద్దాపురం: ఏపీఆర్ఎస్ఏ పెద్దాపురం డివిజన్ ఎన్నికలు విజయవంతం చేయాలని పిఠాపురం డీటీ డి.కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏపీఆర్ఎస్ఏ కాల పరిమితి ముగిసిన నేపథ్యంలో 2023–2026 సంవత్సరానికి గాను బుధవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకూ ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియకు పెద్దాపురం రెవెన్యూ సిబ్బంది సహకరించాలన్నారు.

కౌలు రైతుకు గుర్తింపు



ధర్మవరంలో రైతులకు, కౌలు రైతులకు సాగు కార్డులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

- కౌలు కార్డు మంజూరుకు చర్యలు
- గ్రామాల్లో అవగాహన సదస్సులు

ప్రత్తిపాడు: ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటోంది. అన్నదాత సంక్షేమానికి అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతోంది. ఈ మేరకు భూములు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తిస్తోంది. వారికి సాగుదారుల హక్కుల చట్టం ద్వారా కౌలు కార్డులు ఇచ్చి మద్దతుగా నిలుస్తోంది. దీంతో కౌలు రైతులకు రైతులతో పాటు సమానంగా ప్రభుత్వం నుంచి లభించే లబ్ధి పొందే వీలు కల్పిస్తోంది. ఈనెల 18వ తేదీ నుంచి అన్ని రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకేలు)లో వ్యవసాయ శాఖ అధికారులతో కౌలు రైతుల పంట సాగు చట్టంపై అవగాహన కల్పిస్తోంది. ఈ కార్యక్రమం వచ్చే నెల ఏడో తేదీ వరకూ జరుగుతుంది. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు పంట రుణం పొందడానికి వీలుగా సాగుదారుల కార్డులను ప్రభుత్వం అందిస్తోంది. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు చెందిన కౌలు రైతులందరికీ ఈ కార్డు ద్వారా 'వైఎస్సార్ రైతు భరోసా' వర్తిస్తుంది.

కార్డుతో ప్రయోజనాలు

- పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు భూమిపై ఎటువంటి హక్కులు లభించవు. అయినప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పొందవచ్చు.
- పంట సాగుదారు కార్డు భూ యజమానికి, సాగు చేస్తున్న రైతుకీ మధ్య ఒప్పందాన్ని సూచిస్తుంది.
- భూ యజమాని లేదా వారి ప్రతినిధి సాగుదారు గ్రామ పరిపాలనాధికారి (వీఆర్వో) సంతకం ఉండాలి.
- పంట సాగుదారులకు 11 నెలలు మాత్రమే గడువు. తరువాత కొత్త కార్డులు పొందాలి.
- కార్డు దారుడు పంటలపై బ్యాంకు రుణం తీసుకుంటే ఆ రుణం కట్టే బాధ్యత సాగుదారునిది మాత్రమే.
- ఆ వ్యక్తి ఏ కారణం చేత కట్టకపోతే భూ యజమానిపై ఎటువంటి భారం ఉండదు.

అవగాహన కల్పిస్తున్నాం



కౌలు రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోవాలి. కార్డులు పొందిన రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధి పొందేందుకు ఈనెల 15 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకూ మండలాల్లోని అన్ని ఆర్బీకే కార్యాలయాల్లో అవగాహన కల్పిస్తున్నాం. రైతులు వలంటీర్ల సమన్వయంతో దరఖాస్తు చేసుకోవాలి.

– యింటి వీర గంగాధర్, సహాయ సంచాలకుడు, వ్యవసాయశాఖ, జగ్గంపేట

కార్డులు పొందడం ఇలా..

- రైతులు బాగోగులు చూసే ఆయా గ్రామ వలంటీర్‌కు మీరు భూమిని సాగుకు తీసుకున్న విషయం ముందుగా తెలియజేయాలి.
- ఆ గ్రామ వలంటీర్ పంచాయతీ సచివాలయంలోని గ్రామ పరిపాలన అధికారిని సంప్రదించి సాగుదారు కార్డులకు దరఖాస్తు పొందవచ్చు.
- దరఖాస్తు ప్రక్రియ చాలా సులభం. కార్డుపై యజమాని లేదా ప్రతినిధి సాగుదారు, వీఆర్వోలు సంతకాలు చేస్తే సరిపోతుంది.
- ఈ కార్డు కాపీ ఇద్దరి దగ్గర ఉంటుంది.
- రైతులు సంవత్సర కాలంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో ఎప్పుడైనా కార్డులు పొందవచ్చు.
- దరఖాస్తు చేసుకున్న 48 గంటల లోపే కార్డు లభిస్తుంది.
- కార్డు పొందడంలో ఇబ్బంది కలిగితే సమీప తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

ప్రజలు మెచ్చిన పాలన జగన్‌తోనే సాధ్యం



ఎస్.జగ్గంపేటలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఎస్.జగ్గంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

శంఖవరం: ప్రజల మెచ్చిన పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం ఎస్.జగ్గంపేట గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలిపి, పొందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలు కావాలంటే మళ్లీ జగన్‌ను సీఎంగా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, సర్పంచ్ బైరా ఉప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బైరా శ్రీరామమూర్తి, చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



కేఓ.మల్లవరంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్, నాయకులు



భీమవరపుకోటలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

తుని రూరల్: ప్రజలకు ప్రభుత్వం సేవలు అందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీడీఓ పీఎస్ఈసీ.విద్యా సాగర్ కుమార్ అన్నారు. సోమవారం తుని మండలం కేఓ.మల్లవరం, రాపాకలో గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమంలో సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాల ప్రధానోత్సవం జరిగాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు డొంక సత్యవతి, గూడుపు గౌరీకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీఓ పాల్గొన్నారు. అంకితభావం, సేవా తత్పరతతో సామాజిక సేవాలను అందిస్తున్న సేవలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందులో భాగంగా విశిష్ట సేవలు అందించిన వలంటీర్లను గుర్తించి సేవామిత్ర, సేవరత్న, సేవావజ్ర అవార్డులను అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు తీసుకువెళ్లడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు, ఎంపీటీసీ సభ్యురాలు గంట్ల రమణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు డొంక వెంకట బెనర్జీ, గంట్ల తాతారావు, కార్యదర్శులు ఎస్వీ.ఆదిత్య, జె.వీరబాబు, పైల శివ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

కోటనందూరు: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండి వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. సోమవారం భీమవరపుకోటలో సర్పంచ్ జిగటాల వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి వలంటీర్లను సత్కరించి అభినందించారు.

అన్నవరంతో శరత్‌బాబుకు అనుబంధం



పంపా తీరంలో జరిగిన 'శుభప్రదం' సినిమా షూటింగ్‌లో పాల్గొన్న శరత్‌బాబు, అల్లరి నరేష్ తదితరులు

అన్నవరం: ప్రముఖ నటుడు శరత్‌బాబు మృతితో అన్నవరంలోని ఆయన అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అన్నవరం రత్నగిరి సత్యదేవుని సన్నిధి, పంపా తీరంలో జరిగిన పలు చిత్రాల షూటింగ్‌లో శరత్‌బాబు పాల్గొన్నారు. ప్రధానంగా 2015లో కే విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన అల్లరి నరేష్, మంజరి పడ్నవిస్ హీరో హీరోయిన్‌గా శుభప్రదం సినిమా షూటింగ్ అన్నవరంలో జరిగింది. ఈ సినిమాలో శరత్‌బాబు ప్రధాన పాత్రలో నటించారు. ఆ సినిమా షూటింగ్ సుమారు 20 రోజుల పాటు ఇక్కడే జరిగింది. పంపా తీరంలో పవర్‌హౌస్ వద్ద వేసిన పెంకుటిల్లు సెట్‌లో, పంపా ప్రాజెక్ట్ వద్ద జరిగిన షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన విలేకరులతో చాలా సరదాగా మాట్లాడేవారు.

కోనేరులో పూడికతీత పనులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం వద్ద కోనేరులో పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. 15 ఏళ్లుగా కోనేరులో పూడికతీసి ఇసుక వేయాలని మొర పెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ట్రస్టుబోర్డు సభ్యులు ఆలయ కోనేరుపై ప్రత్యేక దృష్టి సారించారు. పిఠాపురం పాదగయ పుష్కరిణి తయారు చేసిన విధంగా పంచా రామ క్షేత్రం వద్ద పుష్కరిణిని కూడా తయారు చేయాలని నిర్ణయించారు. అయితే దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం లేకపోవడంతో కేంద్ర పురావస్తు శాఖ దృష్టికి ఆలయ కోనేరు పరిస్థితిని తీసుకు వెళ్లారు. పూడికతీతకు పురావస్తు శాఖ రూ.33 లక్షలు మంజూరు చేసింది.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

తుని: రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు (60) మృతి చెందింది. ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ కథనం ప్రకారం.. అన్నవరం రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి ఆ వృద్ధురాలు పట్టాలు దాటుతోంది. అదే సమయంలో తుని నుంచి సామర్లకోట వైపు వెళ్తున్న రైలు ఢీకొని, అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె వద్ద ఎటువంటి ఆధారాలూ లభించలేదు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 94906 19020, 94948 87786 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై మారూఫ్ తెలిపారు.

అడ్మిషన్లపై దృష్టి సారించాలి

ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ



కోటనందూరు హైస్కూల్లో షూ నాణ్యతను పరిశీలిస్తున్న ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ

కోటనందూరు: ప్రభుత్వ పాఠశాలల్లో వీలైనన్ని ఎక్కువ అడ్మిషన్లు జరిగేలా కృషి చేయాలని సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ కె.హరికృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాల–1ను సందర్శించారు. పాఠశాల పరిధిలో ఉపాధ్యాయులతో కలిసి అడ్మిషన్ల కోసం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన విద్యనందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక స్టాకు పాయింట్‌ను సందర్శించారు. ఇప్పటికే అక్కడకు చేరుకున్న విద్యాకానుక కిట్లలోని వస్తువుల నాణ్యతను ఎంఈఓ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంఆర్సీకి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. సీఆర్పీ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు ఆర్థిక భరోసా



కేఈ చిన్నయ్యపాలెంలో కౌలుకార్డుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: కౌలు రైతులకు ఆర్థిక భరోసానిచ్చేందుకు కౌలు కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని వ్యవసాయాధికారి కె.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం గ్రామాల్లో కౌలుకార్డుల జారీపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడతూ కౌలు కార్డు కాలపరిమితి కేవలం 11 నెలలు మాత్రమేనన్నాను. కార్డుల ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. కార్డుల జారీకి అంగీకారం తెలపడంలో రైతులకు ఎటువంటి అనుమానాలకు తావులేదన్నారు. ఖరీఫ్ సన్నద్ధతపై రైతులకు అవగాహన కల్పించారు. లోవ దేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, సర్పంచులు పసగడుగుల వరహాలు, గుడ్ల సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు కరక అప్పలనాయుడు, ఏఈఓ కేవీ శివకుమారి, వీఏఏలు పి.రాజేశ్వరిదేవి, జి.రాంబాబు పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన

శంఖవరం: కౌలు రైతులు కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని కొంతంగి, నెల్లిపూడి గ్రామాల్లో సోమవారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కౌలు పత్రం వల్ల అసలు రైతుకు ఎటువంటి నష్టం లేదన్నారు. ప్రభుత్వ పథకాల్లో కౌలు రైతులు లబ్ధి పొందేలా ప్రభుత్వం వీలు కల్పించిందన్నారు. లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జగ్గంపేట: గొల్లగుంటలో రైతు భరోసా కేంద్ర వద్ద సోమవారం కౌలు రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. భూ యజమానులకు, కౌలు రైతులకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డి.రఘు, వీఆర్వో, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై విద్యాసాగర్

గండేపల్లి, జగ్గంపేట: కాట్రావులపల్లిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాజులూరు మండలం పాత మంజేరు గ్రామానికి చెందిన కర్రి అర్జున్(32) కుటుంబ సమేతంగా పెద్దాపురం మండలం తిమ్మాపురంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అర్జున్ కాట్రావులపల్లిలో కాకినాడ రవికుమార్ వర్మకు చెందిన రొయ్యల చెరువు వద్ద సూపర్‌వైజర్‌గా ఉంటూ విద్యుత్, జనరేటర్ పనులు చేస్తుంటాడు. బంధువుల ఇంటా జరిగే వివాహానికి వెళ్లాల్సి ఉండగా రొయ్యల చెరువు వద్ద పనులు చూసుకుని తరువాత వస్తానని చెప్పి ఆదివారం భార్య, కొడుకును పంపించాడు. రాత్రి 9 గంటలు అయినా వివాహానికి రాకపోవడంతో భార్య మాలశ్రీ పలు మార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. సమీపంలోని చెరువు కాపలాదారులు రొయ్యల చెరువు వద్దకు వెళ్లి చూసే సరికి అర్జున్ మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. మృతుని ఎడమ చేయి వేళ్లు పూర్తిగా మాడిపోయి, కుడి చేయి మూడు వేళ్లు కాలిపోయి ఊడిపోయినట్టు గమనించారు. రొయ్యల చెరువులో ఏర్పాటు చేసిన ఫ్యాన్ యంత్రానికి అమర్చిన విద్యుత్ తీగలు తగలడం కాని, మరే ఇతర కారణాల వల్ల గాని మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడు కర్రి కామేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎఫ్ఏ అవినీతిపై విచారణ



విచారణ జరుపుతున్న రాష్ట్ర బృందం

పెద్దాపురం: మండలంలోని రాయభూపాలపట్నంలో ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ కలిదిండి రామకృష్ణ అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద రాష్ట్ర అధికార బృందం బహిరంగ విచారణ జరిపింది. పంచాయతీరాజ్ కమిషనరేట్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వైవీవీ ప్రసాద్, అంబుడ్స్‌మన్ జ్యోతి, ఎస్ఆర్పీ తిరుపతిరావు, ఏపీడీ భానుప్రకాష్, ఎంపీడీఓ హిమమహేశ్వరి కూలీలు, గ్రామస్తులతో మాట్లాడి రామకృష్ణపై వచ్చిన అవినీతి ఆరోపణపై విచారణ జరిపారు. దొంగ మస్తర్లు వేశారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇటీవలే బహిరంగ సామాజిక వేదిక సుమారు 80 వేల రూపాయలు అవినీతి జరిగినట్లు తేల్చింది. దీంతో అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ఇంకా మస్తర్ల విషయంలో సుమారు రూ.మూడు లక్షలకు పైగా అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర బృందం విచారణ చేపట్టింది. ఇంత జరుగుతున్నా ఏపీడీ, ఏపీఓ పర్యవేక్షణ ఎందుకు లేదంటూ రాష్ట్ర బృందం అధికారులపై మండిపడింది. అజమాయిషీ లోపంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ వరప్రసాద్ మాట్లాడుతూ విచారణ నివేదికను మూడు రోజుల్లో కమిషనర్‌కు అందజేస్తామన్నారు.

పన్ను చెల్లింపులో రూ.2 వేల నోట్ల స్వీకరణ

తుని: ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు, నీటి చార్జీల చెల్లింపులో రూ.2 వేల నోట్లను స్వీకరిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు సోమవారం తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30తో 2 వేల నోట్ల చెలామణి గడువు ముగుస్తున్న నేపథ్యంలో బ్యాంకులతో పాటు పన్ను చెల్లింపు సమయంలో స్థానిక మున్సిపల్ ట్రెజరీలో కూడా రూ.2 వేల నోట్లు స్వీకరిస్తున్నట్టు తెలిపారు.

రూరల్ ఎస్సైగా విజయబాబు



విజయబాబు

తుని రూరల్: తుని రూరల్ ఎస్సైగా జె.విజయబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ రూరల్ ఎస్సైగా పని చేసిన ఎ.బాలాజీ కాకినాడ ట్రాఫిక్ ఎస్సైగా బదిలీ కావడంతో ఆ స్థానంలో కాకినాడ ట్రాఫిక్–2 ఎస్సైగా పని చేస్తున్న జె.విజయబాబు తుని రూరల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై విజయబాబు మాట్లాడుతూ తుని మండలంలో విస్తరించి ఉన్న 18 కిలోమీటర్ల జాతీయ రహదారి, తుని, నర్సీపట్నం ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణ, గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండ చర్యలు తీసుకుంటానన్నారు. జూదం, కోడి పందేలపై కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. లోవదేవస్థానంలో ఆషాడమాసంలో జరగనున్న జాతరోత్సవాలకు సీఐ, తమ సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

ట్రిపుల్‌ఆర్ సెంటర్‌కు అనూహ్య స్పందన



తునిలో పాత వస్తువులను అందజేస్తున్న మహిళ

తుని: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు అనూహ్య స్పందన లభించిందని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. సోమవారం ఈ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి పలువురు వినియోగించని పలు వస్తువులను అందజేశారు. పట్టణ పరిధిలోని ప్రజలు పాత ఆట వస్తువులు, ప్లాస్టిక్, పాత బట్టలను అందజేయాలని ప్రజా ఆరోగ్యశాఖాధికారి శేఖర్ కోరారు. మనం ఉపయోగించని వస్తువులు మరొకరికి అందించే అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వంట గ్యాస్ వినియోగం, ప్రమాదాల నివారణపై అవగాహన



వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించిన దృశ్యం

తొండంగి: వంట గ్యాస్ వినియోగం, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శృంగవృక్షంలో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. తొండంగి వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కళాజాతా కళాకారుడు వీర్నాల కృష్ణ బృందం గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ సిలెండర్ వద్ద మంటలు వ్యాపిస్తే మంటలను ఆర్పే విధానంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, గ్రామపెద్దలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

పత్తిపాడు రూరల్: ధర్మవరం గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, సృజనాత్మకత కథలు చెప్పడం తదితర వాటిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ జూన్ 11వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు జరగనున్నట్టు గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ వి.సన్యాసిరావు తెలిపారు.

సారా స్వాధీనం

గండేపల్లి: గ్రామ శివారులో పుష్కర కాలువ వద్ద సారా తయారీదారులను అరెస్టు చేసినట్టు ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సర్వసిద్ధి వీరబాబు, అక్కిరెడ్డి దుర్గారావు తయారు చేసిన సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

పట్ట పగలే చోరీ

గండేపల్లి: పట్ట పగలు, ఆపై జనసంచారం ఉండే ప్రదేశంలో మహిళ మెడలో బంగారు నల్లపూసల తాడు లాక్కొని ఉడాయించాడు. ఈ ఘటనపై గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం.. తుని మండలం వెలమ కొత్తూరు గ్రామానికి చెందిన గొల్లవిల్లి లక్ష్మి, భర్త లోవరాజు మోటారు సైకిల్‌పై సోమవారం రాజమహేంద్రవరం వెళుతున్నారు. మండలంలోని జెడ్.రాగంపేట పరిధి ఆదిత్య హాస్పిటల్ వద్దకు వచ్చేసరికి వారి వెనుకే ఏపీ39జీఎన్1277 నంబర్ గల బుల్లెట్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి లక్ష్మి మెడలో మూడు కాసుల నల్లపూసల తాడును బలవంతంగా లాక్కుని వెళ్లిపోయాడు. దుండగుడు సుమారు పది కిలోమీటర్ల దూరం నుంచి వెంబడిస్తూ హైవేపై వచ్చేసరికి చోరీకి పాల్పడ్డాడని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.